అమ్మాయిలకు ఎదురుందా?

- నేడు భారత్, ఇంగ్లండ్ సెమీస్
- అండర్-19 టీ20 ప్రపంచకప్

కౌలాలంపూర్: ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దుమ్ము రేపుతున్న యువ భారత జట్టు.. శుక్రవారం జరిగే తొలి సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌ను ఢీకొననుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన టీమ్ ఇండియా.. అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. లీగ్ దశ, సూపర్ సిక్స్‌తో పోలిస్తే సెమీస్‌లో ఎదురయ్యే ప్రత్యర్థి కాస్త బలమైన జట్టు కావడంతో అమ్మాయిలు జాగ్రత్తగా ఆడాల్సి ఉంది. అయితే ఇంగ్లండ్‌తో పోలిస్తే బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో యంగ్ ఇండియా బలంగా ఉంది. బ్యాటింగ్‌లో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. రికార్డు శతకంతో పాటు రెండు 40+ స్కోర్లతో టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్ (230)గా కొనసాగుతున్నది. త్రిష సెమీస్‌లోనూ ఇదే జోరు కనబర్చాలని భారత్ ఆశిస్తోంది. బ్యాట్‌తో పాటు బంతితోనూ ఆమె సత్తా చాటుతుండటం జట్టుకు కలిసి వస్తోంది. ఇక రెండో ఎడిషన్‌లో ఇప్పటివరకూ భారత్‌తో ఆడిన ఏ జట్టూ బ్యాటింగ్ చేస్తూ 75 పరుగుల మార్కును దాటలేకపోయిందంటే వికెట్ల వేటలో మన బౌలర్లు ఎంత ఆకలిగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. స్పిన్నర్లు వైష్ణవి శర్మ, అయూషి శుక్లాతో పాటు పేసర్లు జోషితా, షబ్నమ్ చెలరేగితే వరుసగా రెండోసారి ఫైనల్ చేరడం భారత్‌కు పెద్ద కష్టమేమీ కాదు.

ఢిల్లీకి కోహ్లీ ఫీవర్!

విరాట్‌ను చూసేందుకు పోటెత్తిన అభిమానులు

స్టేడియం దగ్గర స్వల్ప తోపులాట ● ఫ్యాన్స్‌ను అదుపు చేసేందుకు పారా మిలటరీ

ఢిల్లీ: కోహ్లీ.. కోహ్లీ.. కోహ్లీ..! అరుణ్ జైట్లీ స్టేడియంలో గురువారం ఎక్కడ చూసినా ఇవే అరుపులు. పుష్కరకాలం తర్వాత దేశవాళీలో పునరాగమనం చేసిన విరాట్ కోహ్లీని చూసేందుకు అభిమానులు పోటెత్తారు. డొమెస్టిక్ మ్యాచ్‌లు చూసేందుకు అభిమానులను ఉచితంగా అనుమతించగా.. తమ ఆరాధ్య క్రికెటర్ ఆటను వీక్షించేందుకు జైట్లీ స్టేడియానికి ఫ్యాన్స్ భారీ ఎత్తున తరలివచ్చారు. ఢిల్లీ, రైల్వేస్ మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో కోహ్లీ ఆటను చూసేందుకు సుమారు 10 వేల మంది అభిమానులు వస్తారని ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అంచనా వేసినా ఆ సంఖ్య 16 వేలు దాటినట్టు సమాచారం. గౌతం గంభీర్ స్టాండ్ (6 వేల సీటింగ్ సామర్థ్యం) పూర్తిగా నిండిపోవడంతో అదనపు గేట్లను తెరిచి బిషన్‌సింగ్ బేడీ స్టాండ్ (12 వేల సామర్థ్యం)లోనూ ఫ్యాన్స్‌ను అనుమతించారు. ప్రేక్షకులు స్టేడియం లోపలికి వచ్చే సమయంలో కొంత తోపులాట కూడా జరిగింది. అయితే కోహ్లీ బ్యాటింగ్ చూద్దామనుకున్న అభిమానులకు.. మ్యాచ్‌లో మొదట రైల్వేస్ బ్యాటింగ్ చేయడం ఒకింత నిరాశకు గురి చేసింది. రైల్వేస్ తొలి రోజే ఆలౌట్ అవడంతో రెండో రోజు కోహ్లీ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉండటంతో అభిమానుల సంఖ్య మరింత పెరగొచ్చు. మొదటి రోజు బ్యాటింగ్‌కు రాకున్నా కోహ్లీ ఫీల్డింగ్‌లో తనదైన హావభావాలతో ఫ్యాన్స్‌ను అలరించాడు. తనను చూసేందుకు వచ్చిన అభిమానులను ఉత్సాహపరిచేందుకు ప్రయత్నించాడు.

భద్రతకు పారా మిలటరీ: తమ అభిమాన క్రికెటర్‌ను చూసేందుకు స్టేడియానికి భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను నియంత్రించేందుకు పారా మిలటరీ బలగాలను మోహరించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే బలగాల కండ్లుగప్పి ఒక అభిమాని మైదానంలోకి ప్రవేశించి కోహ్లీ కాళ్లు మొక్కే ప్రయత్నం చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతన్ని తమ అదుపులోకి తీసుకున్నారు. అయితే ఫ్యాన్స్ పట్ల కఠినంగా వ్యవహరించవద్దని కోహ్లీ కోరాడు.

వైష్ణవికి స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కోల్‌కతా వేదికగా జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నీలో తెలంగాణ యువ జిమ్నాస్ట్ వైష్ణవి వ్యాస్ స్వర్ణ పతకంతో మెరిసింది. గురువారం జరిగిన బాలికల అండర్-14 టేబుల్ వాల్ట్ విభాగంలో వైష్ణవి అగ్రస్థానంలో నిలిచి పసిడి ఖాతాలో వేసుకుంది.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సుబ్రహ్మణ్యన్ క్వార్టర్స్‌కు చేరారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో జేసన్ గునవన్‌ను 42 నిమిషాల్లోనే ఓడించాడు. మరో పోరులో సుబ్రహ్మణ్యన్ 9-21, 21-10, 21-17తో వర్డొయెపై గెలిచాడు. రక్షిత 21-15, 21-12తోటంగ్‌ను ఓడించింది.

చాంపియన్ టీడీసీఏ ఎలెవన్

మహేశ్ జాదవ్ అజేయ సెంచరీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగిన తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) అండర్-17 టీ20 టోర్నీ ఘనంగా ముగిసింది. గురువారం జరిగిన ఫైనల్లో టీడీసీఏ ఎలెవన్ 13 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్‌పై విజయం సాధించింది. తొలుత టీడీసీఏ ఎలెవన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు చేసింది. ఓపెనర్ మహేశ్ జాదవ్(63 బంతుల్లో 101 నాటౌట్, 16ఫోర్లు, సిక్స్) అజేయ సెంచరీతో విజృంభించగా, శివశంకర్(34 బంతుల్లో 52, 8ఫోర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. లక్ష్యఛేదనలో మహబూబ్‌నగర్ 19.3 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సంజు(41), వీరేందర్(27), దీపక్‌పాటిల్(24) రాణించినా లాభం లేకపోయింది. టీడీసీఏ బౌలర్లు దీక్షిత్(3/23), అరుణ్‌కుమార్(2/26), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహేశ్(2/26) ఆకట్టుకున్నారు. టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి విజేతలకు ట్రోఫీ అందజేశారు.

ఖవాజా ద్విశతకం

ఆస్ట్రేలియా 654/6 డిక్లేర్డ్

గాలె: ఇటీవల ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టుల్లోనూ ఘోరంగా విఫలమై తీవ్ర విమర్శలెదుర్కొంటున్న ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా.. శ్రీలంకతో గాలెలో జరుగుతున్న మొదటి టెస్టులో మాత్రం సత్తా చాటాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఖవాజా (352 బంతుల్లో 232, 16 ఫోర్లు, 1 సిక్స్) ద్విశతకంతో కదం తొక్కాడు. అతడి కెరీర్‌లో ఇదే తొలి డబుల్ సెంచరీ కాగా లంకేయులపై ద్విశతకం చేసిన తొలి ఆసీస్ క్రికెటర్‌గా ఖవాజా రికార్డులకెక్కాడు. అతడితో పాటు స్టీవ్ స్మిత్ (141), అరంగేట్ర ఆటగాడు జోష్ ఇంగ్లిష్ (102) శతకాలతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 6 వికెట్లు కోల్పోయి 654 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన లంక.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 44 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

పుణెలో పట్టేస్తారా?

నేడు భారత్, ఇంగ్లండ్ నాలుగో టీ20

సిరీస్ సమం చేయాలనే లక్ష్యంతో బట్లర్ సేన

శాంసన్, సూర్య బ్యాటింగ్‌పై టీమ్‌ఇండియా ఆందోళన

వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి జోరు మీదున్నప్పటికీ మూడో టీ20లో బ్యాటింగ్ వైఫల్యంతో తడబడ్డ భారత్.. శుక్రవారం పుణె వేదికగా ఇంగ్లండ్‌తో జరగాల్సిన నాలుగో మ్యాచ్‌కు సిద్ధమైంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ)లో జరుగబోయే ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఇక్కడే పట్టేయాలనే లక్ష్యంతో టీమ్‌ఇండియా బరిలోకి దిగుతోంది. రాజ్‌కోట్‌లో బౌలర్లు రాణించినా బ్యాటర్లు విఫలమవడంతో 'మెన్ ఇన్ బ్లూ' మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కానీ పుణెలో మాత్రం ఆ తప్పిదాలను పునరావృతం కాకుండా చూసుకోవాలని సూర్యకుమార్ సేన భావిస్తోంది. మరోవైపు కోల్‌కతా, చెన్నైలలో ఓడినా రాజ్‌కోట్‌లో ఇంగ్లీష్ జట్టు బలంగా పుంజుకుంది. పుణెలోనూ సత్తా చాటి సిరీస్‌ను 2-2తో సమం చేసి ముంబైలో చివరి మ్యాచ్‌తో తాడోపేడో తేల్చుకోవాలని ఇంగ్లండ్ పట్టుదలతో ఉన్న నేపథ్యంలో ఇరు జట్ల మధ్య మరో రసవత్తర పోరు జరిగే అవకాశముంది.

పుణె: టాపార్డర్‌లో ఓపెనర్ సంజూ శాంసన్, సారథి సూర్యకుమార్ యాదవ్ ఫామ్ భారత్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. రాక రాక వచ్చిన అవకాశాలను గతేడాది పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ఓపెనర్‌గా స్థానాన్ని సుస్థిరం చేసుకుంటాడని భావించిన సంజూ.. తాజా సిరీస్‌లో గాడి తప్పుతున్నాడు. ఆర్చర్, వుడ్ విసిరే షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో ఇబ్బందులు పడుతున్న ఈ కేరళ వీరుడు.. పుణెలో అయినా ఆ బలహీనతను అధిగమించాలని భారత్ కోరుకుంటోంది. ఈ సిరీస్‌లో (26, 5, 3 రన్స్) మూడుసార్లూ ఆర్చర్ వేసిన షార్ట్ బాల్స్‌కే శాంసన్ నిష్క్రమించాడు. పుణెలోనూ విఫలమైతే అతడి ఓపెనింగ్ స్థానంతో పాటు జట్టులో చోటూ ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. శాంసన్‌తో పాటు సారథి సూర్య కూడా ఈ సిరీస్‌లో ఘోరంగా విఫలమవుతున్నాడు. కోల్‌కతాలో డకౌట్ అయిన సూర్య.. చెన్నైలో 12 పరుగులే చేయగా రాజ్‌కోట్‌లో బాధ్యతాయుతంగా ఆడాల్సిన దశలోనూ అనవసర షాట్ ఆడబోయి 14 పరుగులకు వెనుదిరిగాడు. శుక్రవారం మ్యాచ్‌లో అయినా కెప్టెన్ విజృంభించకుంటే భారత్‌కు బ్యాటింగ్ తిప్పలు తప్పవు. గత మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన అభిషేక్, తిలక్ పుణెలో మెరుపులు మెరిపించాలని భారత్ కోరుకుంటోంది.

రింకూ, అర్ష్‌దీప్ రీఎంట్రీ

వెన్ను నొప్పి కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరమైన రింకూ సింగ్.. పూర్తి ఫిట్ అయ్యాడు. పుణెలో అతడిని ఆడిస్తే జురెల్ బెంచ్‌కే పరిమితమవ్వొచ్చు. ఆల్‌రౌండర్ కోటాలో రమణ్‌దీప్ సింగ్, శివమ్ దూబెలలో ఒకరికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. ఇంగ్లండ్ స్పిన్నర్ అదిల్ రషీద్‌ను ఎదుర్కోవడంలో భారత మిడిలార్డర్ తంటాలు పడ్డ నేపథ్యంలో స్పిన్‌ను బాగా ఆడగలిగే దూబె వైపు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపొచ్చు. ఇక గత మ్యాచ్‌లో ఆడలేకపోయిన అర్ష్‌దీప్‌ను పుణెలో ఆడించనున్నట్టు సమాచారం. అతడొస్తే ఎవరిని పక్కనపెడతారనేది ఆసక్తికరం.

సిరీస్ సమమే లక్ష్యంగా..

తొలి రెండు మ్యాచ్‌లలో భారత స్పిన్‌కు కుదేలైన ఇంగ్లండ్.. రాజ్‌కోట్‌లో మాత్రం అదే స్పిన్‌తో సూర్య అండ్ కో.ను దెబ్బతీసి విజయవంతమైంది. ఓపెనర్ బెన్ డకెట్ గత మ్యాచ్‌లో వీరవిహారం చేయగా అతడు జోరు కొనసాగించాలని ఇంగ్లీష్ జట్టు కోరుకుంటోంది. కానీ మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ వరుసగా విఫలమవుతున్నాడు. బట్లర్ టచ్‌లోనే ఉన్నా బ్రూక్‌తో పాటు మిడిలార్డర్ బ్యాటర్లు భారత స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కోలేక పెవిలియన్‌కు చేరుతున్నారు. గత మ్యాచ్‌లో లివింగ్‌స్టన్ కాస్త ప్రతిఘటించి ఆ జట్టుకు భారీ స్కోరునందించాడు.

వచ్చే నెల16న ప్రారంభ వేడుకలు

కరాచీ: పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరుగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో వచ్చే నెల 16న ప్రారంభ వేడుకలు జరుగనున్నాయి. ఈ టోర్నీలో.. 16న లాహోర్‌లో ఓపెనింగ్ సెర్మనీని నిర్వహించనున్నట్టు పీసీబీ ప్రతినిధి ఒకరు తెలిపారు. లాహోర్‌లోని హుజూరి బాగ్ కోటలో ఈ వేడుకలు జరుగనున్నాయి. అయితే టోర్నీకి ముందు కెప్టెన్ల ఫొటోషూట్ లేదని పీసీబీ అధికార వర్గాలు పేర్కొన్నాయి.

విదర్భ 190 ఆలౌట్

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బీలో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ 190 పరుగులకే ఆలౌట్ చేసింది. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ్ (3/29), అనికేత్ (3/54), మిలింద్ (2/46) విదర్భను కట్టడి చేశారు. సిరాజ్ (1/47) ఫర్వాలేదనిపించాడు. హైదరాబాద్ 2 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది.

'స్పిరిట్' కోసం కసరత్తులు

ప్రస్తుతం 'ది రాజా సాబ్' 'ఫౌజీ' చిత్రాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు ప్రభాస్. వీటి తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నారు. ఈ సినిమా ఫిబ్రవరిలోనే మొదలవుతుందని వార్త లొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం మేలో సెట్స్‌మీదకెళ్లనుందని తెలిసింది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులను పూర్తి చేసే పనిలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా బిజీగా ఉన్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. పోలీస్ జానర్ చిత్రాల్లో ఇప్పటివరకు రాని వినూత్నమైన కాన్సెప్ట్‌తో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమా కోసం ప్రభాస్ ఇంటెన్స్ ఫిజికల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నారట. పోలీస్ పాత్రలో మరింత స్లిమ్‌గా, ఫిట్‌గా కనిపించేందుకు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సూచనల మేరకు పూర్తి మేకోవర్‌కు సిద్ధమవుతున్నారట. పోలీస్ కథలకు సరికొత్త నిర్వచనంలా ఈ సినిమా ఉంటుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ సినిమా కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించారని, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమా విడుదలకానుంది సమాచారం.

చిత్రం

సల్మాన్‌తో రెండో చిత్రం

అగ్ర కథానాయిక రష్మిక మందన్నకు చేతినిండా సినిమాలున్నాయి. ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో మొత్తం ఐదు సినిమాల్లో నటిస్తున్నదీ భామ. అయితే అవన్నీ తుదిదశ చిత్రీకరణకు చేరుకోవడంతో కొత్త సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నది. తాజాగా రష్మిక మందన్న హిందీలో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుంది. సల్మాన్ ఖాన్‌తో ఇప్పటికే 'సికందర్' చిత్రంలో నటిస్తున్న రష్మిక..ఆయనతో మరో సినిమాకు ఓకే చెప్పింది. వివరాల్లోకి వెళితే.. షారుఖ్‌ఖాన్ 'జవాన్'తో హిందీలో బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నారు తమిళ దర్శకుడు అట్లీ. ఈ విజయంతో బాలీవుడ్ అగ్ర హీరోలు ఆయనతో సినిమాలు చేయడానికి ఉత్సాహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సల్మాన్‌ఖాన్‌తో అట్లీ ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇందులో రష్మిక మందన్న కథానాయికగా ఖరారైందని ముంబయి మీడియాలో వార్తలొస్తున్నాయి. సల్మాన్‌ఖాన్‌తో దేశం గర్వించబోయే సినిమా తీయబోతున్నానని ఇటీవల దర్శకుడు అట్లీ ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే హైప్ క్రియేట్ అయింది. ఇక సల్మాన్‌ఖాన్, రష్మిక మందన్న జంటగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సికందర్' మార్చిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

'విశ్వంభర' డేట్ ఫిక్సయిందా?

సంక్రాంతికి విడుదల కావాల్సిన 'విశ్వంభర' వాయిదా పడ్డ విషయం తెలిసిందే. ఈ సినిమా రిలీజ్ డేట్ కోసం మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు కూడా మెప్పించడంతో సినిమాపై భారీ హైప్ నెలకొని ఉంది. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల్లో ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు. విశ్వంభర అనే సరికొత్త ప్రపంచంలో ప్రేక్షకుల్ని విహరింపజేసే చిత్రమిదని, ఓ దైవకార్యం కోసం కథానాయకుడు చేసే ప్రయత్నాలు ఆద్యంతం సాహసం, సంభ్రమం కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తాయని చిత్రబృందం చెబుతున్నది. యూవీ క్రియేషన్స్ సంస్థ భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

సూర్య

తెలుగు సినిమా

తమిళ డబ్బింగ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు హీరో సూర్య. తమిళ, తెలుగు భాషల్లో తిరుగులేని ఫాలోయింగ్ ఆయన సొంతం. మంచి కథ కుదిరితే స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయాలన్నది తన కలని సూర్య అనేక ఇంటర్వ్యూల్లో చెప్పారు. త్రివిక్రమ్, పూరి జగన్నాథ్, బోయపాటి శ్రీను వంటి దర్శకులతో సూర్య పనిచేయబోతున్నారని వార్తలొచ్చాయి. అయితే అవన్నీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా సూర్య తెలుగు స్ట్రెయిట్ చిత్రానికి ఓకే చెప్పినట్లు తెలిసింది. 'ప్రేమమ్' 'కార్తికేయ-2'ఫేమ్ చందూ మొండేటి దర్శకత్వంలో సూర్య సినిమా దాదాపు ఖరారైంది. ఈ విషయాన్ని దర్శకుడు చందూ మొండేటి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కార్తికేయ-2' సినిమా చూసి సూర్య బాగా ఇంప్రెస్ అయ్యారని, ఇద్దరం కలిసి సినిమా చేద్దామని ఆఫర్ ఇచ్చారని చందూ మొండేటి తెలిపారు. 'సూర్యకు రెండు కథలు వినిపించా. ఆ రెండూ నచ్చాయని చెప్పారు. అందులో ఒకటి ఫైనల్ చేయాల్సి ఉంది' అని చందూ మొండేటి పేర్కొన్నారు. ఆయన దర్శకత్వంలో నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన 'తండేల్' ఫిబ్రవరి 7న విడుదలకానుంది. ఈ సినిమా తర్వాత సూర్య సినిమా సెట్స్‌మీదకు వెళ్లే అవకాశం ఉంది.

అగత్యా ప్రపంచంలోకి..

జీవా, అర్జున్ సర్జా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అగత్యా'. గీత రచయిత పా.విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఐసరి గణేష్ నిర్మాత. రాశీఖన్నా కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కావాల్సి ఉంది. అయితే కథానుగుణంగా వీఎఫ్ఎక్స్ వర్క్‌కు అధిక ప్రాధాన్యం ఉండటంతో ఫిబ్రవరి 28కి చిత్రాన్ని వాయిదా వేసినట్లు మేకర్స్ తెలిపారు. మార్వెల్ సినిమాల తరహాలో ఓ సరికొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లే చిత్రమిదని, మన సంస్కృతి, మానవ సంబంధాలు ప్రధానంగా కథ నడుస్తుందని, ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని చిత్రబృందం పేర్కొంది.
ఈ చిత్రానికి యువన్‌శంకర్ రాజా సంగీతాన్నందిస్తున్నారు.

ఆర్మీ నేపథ్యంలో 'మిషన్ 007'

భరత్ చౌదరి, ప్రియాంక నాంది జంటగా నటించిన చిత్రం 'మిషన్ 007'. జె.మోహన్‌కాంత్ దర్శకత్వంలో మహంకాళి నాగ మహేష్ నిర్మించారు. ఇటీవలే ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథాంశమిదని, మధ్యప్రదేశ్‌లోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపామని, యాక్షన్..సందేశంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. దేశభక్తి ప్రధానంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని నిర్మాత పేర్కొన్నారు. సందేశాత్మక కథలో భాగం కావడం ఆనందంగా ఉందని, తన పాత్ర భావోద్వేగాలతో సాగుతుందని హీరోయిన్ ప్రియాంక చెప్పింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.